# ధైర్యము

శ్రీమతి పాకల చంద్రకాంతామణిగారు

అత డొకరాజు. అతడు చిరకాలమునుండి వ్యాధిపీడితుడాయెను. వారముదినములలోపల దుర్గకు యొక నరబలి యీయకున్న యాతడు తప్పక మరణించును. ఇది యాతని జాతకఫలము.

బలిపురుషునకు గావలసిన లక్షణములన్నియు నొకబీదకాపువాని సుతున కుండెను. హెచ్చుగా ధనమిచ్చి యాబాలుని రాజభటులు దమ యధీనము గావించుకొనిరి.

నియమితకాల మేతెంచెను. బలిపురుషుని స్నానముచేయించి శుభ్ర వస్త్రాలంకృతునిగావించి బలిపీఠమునొద్దకు గొనివచ్చిరి. రాజు మొదలు పూటకు గతిలేని బికారివరకు యచ్చట నిండిపోయిరి. బలివేయువ్యక్తి తళతళలాడు గండ్రగొడ్డలిని జేబూని యాతని కంఠముపై వేయ బైకెత్తెను.

అట్టితరి నా బాలునివదన మోల్లాందునోగాంచ కుతూహలియై రాజు ముందున కేతెంచి యాతని మోము గాంచెను. ఆశ్చర్యము! నిమిషములో మృత్యుదేవతావదనగహ్వరమున బ్రవేశింపనున్న యా యర్భకునిమోమున చిరునగవు మెరసిపోవుచుండెను. ఆబాలుడు నిశ్చలవదనముతో బరమేశ్వరుని బ్రార్థించుచుండెను. రా జాశ్చర్యపడి బలివేయు వ్యక్తిని చేసన్నచే నిలిపి యాతని చిర్నగవునకు గారణమేమని యాడింభకు నడిగెను.

“ఓ రాజా! ఈ యావత్ప్రపంచమునను జీవికి తల్లిదండ్రులే యాత్మ బంధువులు. అట్టివీరలే క్షణభంగురమును నీచమునగు తుచ్ఛధనమున కాసించి నన్ను మృత్యుదేవతాధీనము గావించిరి. ప్రజల కష్టసుఖముల విచారించి వారికై తన ప్రాణము లడ్డువేయవలసిన రాజే స్వప్రాణరక్షణార్థమై నా ప్రాణములను దీయ సంకల్పించెను. రాజా! ఇక నన్ను గాపాడువారెవ్వరు? గాన దీనజనపోషకుడవగు నో యాపద్బాంధవా? నీవే నాకిక దిక్కని యా కమలాక్షుని బ్రార్థించుచుంటిని. అట్టితరి నాకు నగవురాకుండ నెట్లుండును.” ఇది యా బాలుని ప్రత్యుత్తరము.

నిమిషములో ఆ రాజు మనము కరుణారసముతో నిండిపోయెను. తుచ్ఛప్రాణములకై ఇంతటి ధైర్యసాహసాదులుగల బాలుని జంపింప నాతని మనస్సంగీకరింపలేదు. బలి యాపివేయబడెను. అదృష్టవశముచే రాజు వారము దినముల వెనుక గండముతప్పి యారోగ్యవంతుడై చిరంజీవియాయెను.